పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# బాపట్ల జిల్లాకు రూ.18వేల కోట్ల భారీ ప్రాజెక్టులు..

## జాతీయ రహదారులు, రైల్వే లైన్లతో సరికొత్త కనెక్టివిటీ


## లోక్ సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్

బాపట్ల:( పెన్ పవర్ ) జూన్15 బాపట్లపట్టణంలోని వివేకానంద కాలనీలో గల తన నివాసంలో లోక్ సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో రానున్న రోజుల్లో కేంద్ర నిధులతో కనీవినీ ఎరుగని రీతిలో భారీ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టబోతున్నట్లు ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయని, ఇందులో భాగంగా సుమారు 12వేల కోట్ల రూపాయలు రైల్వే ప్రతిపాదనలు, ఆరువేల కోట్ల రూపాయలు జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పర్యాటక, ఆక్వా రంగాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఆయన ప్రకటించారు. ఆలమూరు వద్ద శతాబ్దాల నాటి చారిత్రక బౌద్ధ స్థూపం సరైన వసతులు లేక శిథిలావస్థకు చేరిందని, విదేశీ బౌద్ధ యాత్రికులకు కనీస వసతులు కల్పించేలా 25 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని ఎంపీ తెలిపారు. ఈ ప్రాజెక్టును అంతర్జాతీయ బౌద్ధ సర్క్యూట్‌లో చేర్చి, త్వరలోనే డీపీఆర్ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. దీనితో పాటు నిజాంపట్నం వద్ద నిలిచిపోయిన హార్బర్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, ఆక్వా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటును కూడా టేక్ అప్ చేస్తున్నామని వివరించారు. రైల్వే రంగానికి సంబంధించి విజయవాడ-గూడూరు నాల్గవ లైన్, రేపల్లె-తెనాలి డబ్లింగ్ పనులకు కేంద్రం ఆమోదం తెలిపిందని.. అలాగే రేపల్లె-బాపట్ల, నిజాంపట్నం హార్బర్-బాపట్ల మధ్య సరికొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి అలైన్‌మెంట్లు ఖరారవుతున్నాయని స్పష్టం చేశారు. చీరాల-సావల్యపురం కొత్త లైన్ ద్వారా హైదరాబాద్ హైస్పీడ్ రైల్ కనెక్టివిటీ సాధించడమే తన తదుపరి లక్ష్యమని, వేమూరు, బాపట్ల, చీరాల ప్రాంతాల్లో త్వరలోనే ఆర్‌ఓబీ ల నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. రోడ్డు రవాణాలో భాగంగా గుంటూరు నుంచి నిజాంపట్నం హార్బర్‌కు సరికొత్త గ్రీన్‌ఫీల్డ్ ఫోర్-లేన్ జాతీయ రహదారిని, కోస్తా తీరంలోని ఎన్‌హెచ్ 216 ను టూ-లైన్ నుండి ఫోర్-లైన్‌గా విస్తరించేందుకు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఒప్పించి డీపీఆర్‌లు సిద్ధం చేయిస్తున్నట్లు వివరించారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర పర్యాటక శాఖ నుండి రూ.97.52 కోట్ల నిధులను ప్రత్యేకంగా పట్టుబట్టి మంజూరు చేయించానని ఎంపీ స్పష్టం చేశారు. అలాగే చీరాలలో త్వరలోనే హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేసి తీరుతానని హామీ ఇచ్చారు. కేంద్రం నుండి తాను కష్టపడి నిధులు ఆమోదింపజేసుకుని తీసుకువస్తుంటే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తామే చేశామంటూ డ్రామాలు ఆడుతోందని, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ.13 లక్షల కోట్ల అప్పుల్లో ముంచడమే కాకుండా ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. తాను లోక్‌సభలో అడుగుపెట్టిన మొదటి రోజే ప్యానల్ స్పీకర్‌గా అవకాశం రావడం గర్వకారణమని, అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా స్థిరపరిచే బిల్లును స్పీకర్ స్థానంలో కూర్చుని తానే ఓటింగ్ ద్వారా పాస్ చేయించడం



చారిత్రాత్మకమని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటోందని కొనియాడారు. గత ప్రభుత్వం ఇసుక దొంగతనాలు, నాసిరకం లిక్కర్ వ్యాపారాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అద్భుతంగా అమలు చేస్తోందని, ప్రతి నెల ఒకటోవ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఇంటికే వచ్చి అందిస్తున్నారని తెలిపారు. తల్లికి వందనం ద్వారా ఒకే కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ లబ్ధి చేకూరుస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఒక తల్లి సంతోషాన్ని పంచుకున్న ఉదాహరణను ఆయన ప్రస్తావించారు. చంద్రబాబు నాయుడు గతంలో ఐటీ హబ్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారని, ఇప్పుడు అమరావతి, పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారని తెలిపారు. విశాఖపట్నంలో గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయని, దీనివల్ల రాష్ట్ర జీఎస్‌డీపీ పెరిగి యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానం నుండి నేడు ప్రపంచంలోనే నాలుగోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, అయిదు ట్రిలియన్ డాలర్ల మార్కుకు చేరువలో ఉందని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వికసిత్ భారత్ 2047 కంటే ముందే స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలు నెరవేరుతాయని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

# శంకర నేత్రాలయ ద్వారా అత్యున్నత కంటి సంరక్షణ సేవలు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






విజయవాడ, పెన్ పవర్, జూన్, 15, పేదల కంటి ఆరోగ్య పరిరక్షణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని.. శంకర నేత్రాలయ సహకారంతో రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షలు, చికిత్స సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ.. శంకర నేత్రాలయ (మొబైల్ ఐ సర్జికల్ యూనిట్), సి.రత్నమాంబ, డీవీఎస్ మూర్తిల జ్ఞాపకార్థం డా. అపర్ణ, డా. మాధవ్ దుర్భా సహకారంతో సోమవారం ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటిపొర చికిత్స శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరంలో కంటిపొర పరీక్షల సేవలు అందుబాటులో ఉంటాయని, ఈ నెల 18 నుంచి 22 వరకు శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. కంటి శుక్లం ఉన్నవారికి ఈ శిబిరంలోనే శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని వివరించారు. శస్త్రచికిత్స జరిగిన వారికి ఐవోఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. సేవలు అవసరమైన వారు 94400 29999, 93930 97373 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించడంలో రెడ్‌క్రాస్, శంకర నేత్రాలయ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు కంటి పొర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డా. జి.సమరం, వైస్ ఛైర్మన్ డా. వెలగా జోషి, సెక్రటరీ ఇ.చిట్టిబాబు, యువజన సంక్షేమ శాఖ అధికారి డా. కొల్లేటి రమేష్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు..

# ఉత్సాహంగా యోగాంధ్ర పోటీలు జిల్లా ఆయుష్ అధికారి డా.వై.రత్నప్రియదర్శిని






విజయవాడ, పెన్ పవర్, జూన్, 15, యోగాంధ్ర-2026లో భాగంగా యోగా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయని.. ఇప్పటికే ప్రారంభమైన జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 16వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోని ఐవీ పేలస్‌లో సోమవారం జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయని.. యోగా అండ్ యూత్ - బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో ఈ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. గ్రామ, మండల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలైన 30 మంది సోమవారం నాటి పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు జరుగుతున్నాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉన్నాయన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వారి దిశానిర్దేశంతో సమన్వయ శాఖల అధికారులతో కలిసి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయుష్ అధికారి ప్రియదర్శిని తెలిపారు...

# బాపట్ల--అప్పికట్ల మధ్య రైల్లో చోరీ ప్రయత్నం..

## పోలీసుల కాల్పులు.. దొంగలు పరార్






బాపట్ల:( పెన్ పవర్) బాపట్ల జిల్లా: బాపట్ల మండలం--అప్పికట్ల రైల్వే మార్గంలో ఈరోజు తెల్లవారుజామున రైలు దోపిడీకి యత్నించిన దుండగులను పోలీసులు చాకచక్యంగా అడ్డుకున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గుర్తించిన పోలీసులు వారిని వెంబడించగా, దుండగులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు హెచ్చరిక కాల్పులు జరిపినట్లు సమాచారం. పోలీసుల వెంటాడడంతో దుండగులు తమ వద్ద ఉన్న బ్యాగులను సమీపంలోని పొలాల్లో వదిలేసి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం పోలీసులు బ్యాగులను స్వాధీనం చేసుకుని పరిశీలించగా, వాటిలో కొన్ని దుస్తులతో పాటు రూపాయి నాణేలు (1 Coins) కూడా లభ్యమైనట్లు సమాచారం. రైల్వే భద్రతా వ్యవస్థలను దెబ్బతీయడానికి లేదా సిగ్నలింగ్, ట్రాక్ సర్క్యూట్లలో అంతరాయం కలిగించేందుకు కొందరు నేరగాళ్లు రూపాయి నాణేలను ఉపయోగించే అవకాశం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. కాగా, ఇదే రైల్వే మార్గంలో గత ఏప్రిల్ 19న కూడా ఇలాంటి చోరీ ప్రయత్నం జరిగిన విషయం తెలిసిందే. వరుసగా రెండోసారి ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో రైల్వే ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. దీంతో రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది.

# పేకాట, కోడిపందేల స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి



పెడన, జూన్ 15, పెన్ పవర్ : పెడన పట్టణంలోని వైయస్సార్ కాలనీ, డిటి పాలెం పరిధిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పెడన ఎస్సై-01 జి సత్యనారాయణ, ఎస్సై-02 షేక్ బషీరే లు సోమవారం మెరుపు దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 3,380/- రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెడన గ్రామీణ ప్రాంతాల్లోని కొప్పల్లి గ్రామ పరిధిలో కోడి పందాల శిబిరంపై దాడులు నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక పందెం కోడి రూ. 3,050/- నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత కేసులు నమోదు చేశారు. ఇటీవల అక్రమ జూద కార్యకలాపాలు పెరుగుతున్నాయన్న సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు పలుచోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అలాగే కోడిపందేలు నిర్వహిస్తున్న ప్రదేశాలపై కూడా చర్యలు తీసుకుని నిర్వాహకులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరించారు. పేకాట, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ దాడులతో అక్రమ జూద నిర్వాహకుల్లో కలకలం రేగింది.

# ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ప్రజా మరుగుదొడ్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 15 : చిలకలూరిపేట: పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న ప్రజా మరుగుదొడ్లను మున్సిపల్ కమిషనర్ హరిబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న పారిశుద్ధ్య సేవల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాలపై సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యానికి కీలక పాత్ర ఉందని, అందువల్ల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా గుర్తించిన చిన్నపాటి లోపాలను వెంటనే సరిచేసి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు."ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో నాణ్యత లోపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్య రక్షణే మున్సిపాలిటీ ప్రథమ ప్రాధాన్యత" అని కమిషనర్ శ్రీహరి బాబు స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సూపర్వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మండల పార్టీ అధ్యక్షుడు వీరబాబుకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు



పెడన, జూన్ 15, పెన్ పవర్ బంటుమిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు జన్మదిన వేడుకలు సోమవారం తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని వీరబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి, వీరబాబుకు శాలువా కప్పి సత్కరించారు. పార్టీ బలోపేతానికి, మండలంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి వీరబాబు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

